# హంసలను వేటాడొద్దు [17]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [17]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఆగస్టు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3276

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [17]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** అడవిలో విహారంలో ఉన్నా యెగార్ మనసు ఇదివరకటి చేదు అనుభవాల వల్ల కొంత సంశయాలతో నిండి ఉంటుంది. ముఖ్యంగా కోల్కా పసిమనసు ఎక్కడ బాధపడుతుందోనని. కానీ యూరి పెట్రోవిచ్ మాటల వల్ల అతని సంశయాలు తొలగుతాయి. ఈలోగా నోనా కాసేపు అడవిలో తప్పిపోతుంది. యూరీ కోల్కాలు వెళ్ళి వెతికి తీసుకొస్తారు. అందరూ కలిసి చేపలు పడతారు. అడవికి సరిహద్దు తయారు చేసే ప్రయత్నంలో ఉన్న యెగార్ ను ఒక లిండెన్ చెట్టు ప్రేరేపిస్తుంది. అంతకుముందు స్నానానికి దుస్తులు విడిచిన నోనా నగ్నసౌందర్యాన్ని యాధృచ్ఛికంగా చూసిన అతను ఆ ప్రేరణతో ఈ లిండెన్ చెట్టును ఒక జుట్టు ఆరేసుకుంటోన్న అమ్మాయి శిల్పంగా గొడ్డలితో చెక్కుతాడు. అంతా అబ్బురపడతారు. **ఇక చదవండి:—**

## 17

యెగార్ అడవి అందాలను, అనుకోకుండా నోనా యురీవ్నా అందాలను అనుభూతిచెందుతున్న ఉదయం ఫ్యొడార్ ఇపటొవిచ్, ప్రొకొపిచ్ ఒకరికొకరు ఆహార దుకాణం దగ్గర తారసపడ్డారు. పడవలు అద్దెకిచ్చే కేంద్రానికి వెళ్లటానికి ముందు ప్రతిరోజూ ఊదయం యకోవ్ ప్రొకొపిచ్ ఏమైనా ఆసక్తికరమైనవి ఉన్నాయేమోనని దుకాణంలోకి తొంగిచూసేవాడు. ఫ్యొడార్ ఇపటొవిచ్‌కి పైనుంచి సూచనలు అందేవి: దుకాణం మానేజరు అతడికి అన్ని వార్తలు ముందుగా అందించేవాడు. ఈ రోజు ఇక్కడికి చందువ చేప డబ్బాల్లో వస్తోంది. అది చాలా రుచికరమైన చేప. ఈ చేపకోసం ఫ్యొడార్ ఇపటొవిచ్ అందరికంటే ముందు వచ్చి వరసలో నిలబడ్డాడు.

"ఎలాగున్నావు, ఫ్యొడార్ ఇపటొవిచ్," వరసలో పందొమ్మిదవవాడిగా వచ్చి చేరుతూ అన్నాడు యకోవ్ ప్రొకొపిచ్: దుకాణం మానేజరు, అందులోని ఆడవాళ్లతో సత్సంబంధాలు ఉన్నది ఫ్యొడార్ ఇపటొవిచ్ ఒక్కడికే కాదు.

"బాగానే ఉన్నాను," అంటూ అతడితో మాటల్లోకి దిగే ఉద్దేశం లేదని సూచిస్తూ ఫ్యొడార్ ఇపటొవిచ్ చేతిలోని దినపత్రిక తెరిచాడు.

ఇంకొక రోజైతే ఈ అమర్యాదకి యకోవ్ ప్రొకొపిచ్ మళ్లీ మాట కలిపి ఉండేవాడు కాదు. అయితే, ఈసారి అతడు దీనిని పట్టించుకోలేదు. అతడికి తెలిసిన వార్త అతడి యదలో భారంగా ఉంది, దానిని వెల్లడి చెయ్యాలన్న తహతహలో ఉన్నాడు.

“తనిఖీలో తాజా విషయం ఏమిటి? ఏమైనా తేలిందా?”

“ఏమి తనిఖీ?”

“అటవీ తనిఖీ, ఫ్యొడార్ ఇపటొవిచ్. రిజర్వు అడవి.”

“తనిఖీల గురించీ నాకు ఏమీ తెలియదు,” అన్నాడు ఫ్యొడార్ ఇపటొవిచ్. అయితే, ఉన్నట్టుండి వార్తా పత్రికలోని వరసలు ఒకదానికొకటి కలసిపోసాగాయి, అక్షరాలు పైకి, కిందకీ ఎగరసాగాయి.

“అయితే అది రహస్య తనిఖీ అన్నమాట,” ఒక నిర్ధారణకు వచ్చినట్లు అన్నాడు యకోవ్ ప్రొకొపిచ్. “నీ తోడల్లుడు ఏమీ చెప్పలేదా?”

“ఎవరా తోడల్లుడు?”

“నీ తోడల్లుడు యెగార్ పొలుష్కిన్.”

ఫ్యొడార్ ఇపటొవిచ్ కళ్లు బైర్లు కమ్మాయి: ఏం తనిఖీ? దాంతో యెగార్‌కి ఏమిటి సంబంధం? ఈ ప్రశ్నలు అడగాలని ఒకవైపు ఉన్నా, ఇంకొకవైపు తన పరువు పోతుందన్న భయం ఉంది. వార్తాపత్రికను మడిచి పట్టుకుని, ముఖం చిట్లించాడు.

“అయితే, ఆ విషయం అందరికీ తెలుసన్నమాట.”

అందరికీ తెలిసింది తనూ తెలుసుకోవటంలో తప్పేముంది. కానీ తెలుసుకోవటం ఎలా?

“ఆఁ,” అన్నాడు యకోవ్ ప్రొకొపిచ్. “అయితే ఏ నిర్ధారణలకు వచ్చారో తెలియదు.”

“నిర్ధారణలు ఏమిటి?” ఫ్యొడార్ ఇపటొవిచ్ ఆత్మరక్షణలో పడ్డాడు. “నిర్ధారణలు ఏమీ ఉండవు.”

“అయితే నీకు అన్నీ విషయాలు తెలిసినట్లు లేవు, ఫ్యొడార్ ఇపటొవిచ్,” అన్నాడు అన్నింట్లో పక్కాగా ఉండే యకోవ్ ప్రొకొపిచ్. “భవిష్యత్తు గురించి కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. అందుకోసమే కమిటీలో పాఠశాల టీచరుని కూడా చేర్చారు.”

కమిటీ ఏమిటి? పాఠశాల టీచరు ఏమిటి? నిర్ధారణలు ఏమిటి? వీటన్నిటితో ఆందోళనకు గురైన ఫ్యాడార్ ఇపటొవిచ్ వెంటనే యకోవ్ ప్రొకొపిచ్ దగ్గరకి వెళ్లి అన్ని విషయాలు అడుగుదామని అనుకున్నాడు. కానీ అదే సమయంలో దుకాణం తెరవటంతో మాటలు కట్టిపెట్టి అందరూ వరసలో తిన్నగా నిలబడ్డారు.

సరుకులు తీసుకున్న తరువాత ఆ సంభాషణ కొనసాగింది: అందుకోసమే ఫ్యాడార్ ఇపటొవిచ్ బయట వేచి ఉన్నాడు.

"యకోవ్ ప్రొకొపిచ్, నాకొక విషయం అర్థం కాలేదు. పొలుష్కిన్ ఎక్కడున్నాడన్నావు?"

"కమిటీకి దారి చూపిస్తూ అడవిలో ఉన్నాడు, నీ రక్షిత అడవిలో ఉన్నాడు."

ఫ్యాడార్ ఇపటొవిచ్ చిరచిరలాడుతూ ఇంటికి తిరిగి వచ్చాడు. మారిట్సామీద పెద్దగా అరవటంతో ఆమె చేతిలో గ్లాసు జారవిడిచినంత పనిచేసింది. నాస్తాకి కూర్చున్నాడు కానీ ఏమీ తినలేకపోయాడు. యెగార్ పొలుష్కిన్! కంత్రీ ఎలక! టీచరుకి సహాయం చెయ్యటంలో ఆశ్చర్యమేముంది: అతడు నాకే ఎసరుపెట్ట దలిచాడు. అసలుకే మోసం తలపెట్టాడు.

ఆ రోజంతా అతడు తన విషపూరిత ఆలోచనలతో మౌనంగా గడిపాడు. కమిటీ అంటే శలవ కాదు, తనిఖీ అంటే బహుమతి కాదు. అయితే అది పెద్ద విషయం కాదు, దానిని అతడు నిభాయించుకోగలడు. కానీ, తన సొంత తోడల్లుడు, తన స్నేహితుడు, ఏమీ చేతగాని అసమర్థుడు, గడ్డపార తీసుకుని తన జీవిత పునాదులను పెకిలించటానికి పూనుకున్నాడే – దానిని అతడు క్షమించలేకపోతున్నాడు, భరించలేకపోతున్నాడు. అది అతడి గుండెల్లో మండుతూ తీవ్రంగా సలుపుతోంది. ఫ్యాడార్ ఇపటొవిచ్ దానిని మన్నించలేకపోతున్నాడు. ఆ పనికి పూనుకున్న ఎవరినైనా మన్నించేవాడు కాదు, యెగార్‌నైతే అసలు వదిలిపెట్టడు.

రెండు రోజులపాటు అతడు కుదురుగా లేడు, పెద్దగా తినలేకపోయాడు. మారిట్సా మీద చిరాకు పడేవాడు, ఓవాని కసురుకునేవాడు. ఆ తరువాత దానినుంచి బయటపడినట్లు అనిపించింది. ముఖం మీద నవ్వు కూడా కనపడసాగింది. ముఖం మీద శాశ్వతంగా అతుక్కుపోయిన ఆ నవ్వుని ఫ్యాడార్ గురించి తెలిసిన వాళ్లే అర్థం చేసుకోగలరు.

యెగార్ పొలుష్కిన్‌కి ఈ నవ్వు గురించి తెలియదు, దానిని అతడు ఊహించనూ లేదు. ఆ నవ్వు గురించి అతడికి తెలిసినా దానిని పట్టించుకుని ఉండేవాడు కాదు. ఇతరుల నవ్వుల గురించి

ఆలోచనలు అతడికి లేవు – ఆ సమయంలో అతడు చాలా సంతోషంగా ఉన్నాడు. తన అదృష్టాన్ని నమ్మలేక కోల్కా కూడా నవ్వుతున్నాడు: యూరి పెట్రోవిచ్ తనకి చేపల గాలం ఇచ్చాడు.

“ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అది నాకు వెంటనే కనపడలేదు!” తరగని ఉత్సాహంతో యెగార్ వందోసారి చెప్పిందే చెబుతున్నాడు. “మొదట అది నాకు కనపడింది, ఆ తరువాత మాయమైపోయింది. దానివంక తేరిపార చూస్తూ కూర్చున్నాను. అప్పుడు అది మళ్లీ కనపడింది.”

“నువ్వు అధ్యయనం చెయ్యాలి, యెగార్ సవెలిచ్,” నోనా కూడా అతడికి పదేపదే చెబుతోంది.

“ఆ విషయం మీకు బాగా తెలుసనుకోండి. అది తటాలున బోధపడింది! మీరు నమ్మండి, నమ్మకపోండి, మిత్రలారా, అది ఉన్నట్టుండి మళ్లీ కనపడింది!”

ఆ విధమైన పూర్తి సంతోషంతో అతడు ఊరివైపుకి అడుగులు వేశాడు. పొలిమేరకు చేరుకోగానే ఒక్కసారిగా ఆగిపోయాడు.

“ఏమయ్యింది, యెగార్?”

“అదీ,” అంటూ యెగార్ నిట్టూర్చాడు. “మీరు కాదనరుగదా? నాకు చాలా సంతోషంగా ఉండి మిమ్మల్ని వదిలి వెళ్లాలనిపించటంలేదు. మీరు మా ఇంటికి రాగలుగుతారా? నా దగ్గర ఏమీ లేదనుకోండి. కానీ, నా కోరికను మన్నిస్తారా?”

“మళ్లెప్పుడైనా వస్తాంలే, యెగార్ సవెలిచ్,” నోనా తటపటాయిస్తూ అంది. “నేను నా బట్టలు మార్చుకోవాలి... “

“నీ బట్టలకేం, బ్రహ్మాండంగా ఉన్నాయి,” అన్నాడు యూరి పెట్రోవిచ్. “ధన్యవాదాలు, యెగార్. సంతోషంగా వస్తాం.”

“నాకు ధన్యవాదాలు చెప్పవద్దు! నేనే మీకు ధన్యవాదాలు చెప్పాలి!”

అది పని రోజు, యెగార్ ఆ విషయాన్ని తన “శలవల్లో” పడి మరిచిపోయాడు. హారిటీనా పనికి వెళ్లింది, ఓల్యా శిశుసంరక్షణా కేంద్రంలో ఉంది. వాళ్లు ఇంటికి వెళ్లేసరికి పిల్లి ఒకటి స్వాగతం పలికింది. యెగార్ అరలన్నీ వెతికాడు, అయితే అవన్నీ ఖాళీగా ఉన్నాయి, దాంతో అతడు హడావిడి పడసాగాడు.

"ఇప్పుడు ఏం చెయ్యాలో చూద్దాం. కొడుకా, బంగాళాదుంపలు పొట్టు తీస్తూ ఉండు, ఏం? నోనా యురీవ్నా, ఏం చేస్తే బాగుంటుందో నువ్వు కొంచెం ఆలోచించు. యూరి పెట్రోవిచ్, మీరు కాసేపు సేదతీరండి."

"ఇంటి ఆడమనిషి వచ్చేవరకు వేచి ఉంటే బాగుంటుందేమో?"

"ఆమె ఎలాగూ వచ్చేస్తుంది. కాబట్టి మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి – ముఖం కడుక్కోండి, సిగరెట్టు కాల్చండి. ఏది ఎక్కడ ఉందో కోల్కా మీకు చూపిస్తాడు."

అతిథులతో మాట్లాడుతూనే యెగార్ పలుమార్లు మేరీమాత విగ్రహం వెనక చూసాడు. కానీ అక్కడ ఎన్నిసార్లు చూసినా ఖాళీ డబ్బానే తగులుతోంది. ఇంటిలో చిల్లిగవ్వ కూడా లేదని అతడికి అర్థమయ్యింది. మామూలుగానే అతడికి ఆదుర్దా ఎక్కువ, దీంతో అతడి ఆందోళన మరింత పెరిగిపోయింది. పది రూబుళ్లు సంపాదించటం ఎలా అని అతడు మధనపడసాగాడు. కోపంగా ఉన్న హారిటీనా ముఖం తప్పించి అతడి మనసుకి ఏమీ తట్టటంలేదు.

"కాబట్టి మీరు సేద తీరుతుండండి... నేను చిటికెలో తిరిగివస్తాను."

"నేను కూడా నీతో రానా?" కోల్కాతోపాటు నోనా గదిలోంచి బయటకు వెళ్లటంతో యూరి పెట్రోవిచ్ మెల్లగా అన్నాడు. "ఎంతైనా ఇది మగవాళ్ల పని."

యెగార్ భృకుటి ముడివేశాడు. బెదిరిస్తున్నట్టుగా వేలు కూడా చూపించాడు. "నన్ను అగౌరవ పరచవద్దు. మీరు అతిథి, యూరి పెట్రోవిచ్. కాబట్టి మీరిక్కడ కూర్చుని ఉండటం పద్ధతి. హాయిగా కూర్చుని సిగరెట్టు కాల్చుకోండి. అంతా నేను చూసుకుంటాను."

"ఒక స్నేహితుడిగా కూడా రాకూడదా?"

"అవేమీ నేను వినదలుచుకోలేదు," యెగార్ నిట్టూర్చాడు. "ఆనందంగా ఉన్న రోజును పాడుచెయ్యకు."

అలాగంటూ అతడు పరుగందుకున్నాడు.

అతడికి ఉన్న ఒకే ఒక ఆశ హారిటీనా. ఆమె దగ్గర ఏమైనా డబ్బులు ఉన్నాయేమో, లేదా ఆమె ఎవరి దగ్గరైనా అప్పు తీసుకోగలదేమో, లేదా ఆమె ఏదైనా మంచి సలహా ఇస్తుందేమో. దాంతో ఒక ఖాళీ సంచి, దాని అడుగున ఒక ఖాళీ సీసాతో యెగార్ నేరుగా భార్య దగ్గరికి వెళ్లాడు.

"పిలిచే ముందు నన్ను అడిగావా? ఇప్పుడు నీ తిప్పలు ఎవో నువ్వు పడు."

"టీనా, అదెలా సాధ్యమవుతుంది."

"నేనేం చెయ్యను? నా వద్ద ఒకటిన్నర రూబుళ్లు మాత్రమే ఉన్నాయి. మళ్లీ జీతం డబ్బు వచ్చే దాకా ఓల్యాకి పాలు, రొట్టెకు అవి బొటాబొటి సరిపోతాయి."

ఎర్రబడిన ముఖంతో, చెమటలతో, అలసటతో యెగార్ ముందు ఆమె నిలబడి ఉంది. ఇంటికి సంపాదించి పెట్టే తన పెద్దపెద్ద చేతులను రక్షణగా ఆమె పొట్టమీద పెట్టుకుంది.

"ఎవరైనా అప్పు ఇస్తారేమో?"

"మనకు అప్పు ఇచ్చేవాళ్లు ఎవరూ లేరు. నువ్వు వాళ్లని పిలిచావు, ఆ బాధ్యత నీదే."

"టీనా!"

ఆమె వెళ్లిపోయింది. యెగార్ నిట్టూర్చి, అక్కడే కాసేపు తచ్చాడి, మళ్లీ పరుగందుకున్నాడు. అతడి చివరి ఆశ, చివరి అవకాశం అయిన ఫ్యోడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ దగ్గరకు వెళ్లాడు.

"అలాగా," అంతా విన్న తరువాత అన్నాడు ఫ్యోడార్ ఇపటొవిచ్. "అటవీ వార్డెను పూర్తిగా సంతృప్తి చెందాడంటావు?"

"పూర్తిగా, ఫ్యోడార్ ఇపటొవిచ్," యెగార్ బదులిచ్చాడు. "అతడు నవ్వాడు కూడా."

"నల్లచెరువు దగ్గరకు వెళ్లారా?"

"ఊఁ. అక్కడికి... కొంతమంది పర్యాటకులు వెళ్లినట్టు ఉంది. కొంతమేర అడవిని తగలబెట్టి గబ్బుగబ్బు చేసి పెట్టారు."

"అది కూడా చూసి అటవీ వార్డెను నవ్వాడా?"

యెగార్ నిట్టూర్చి, తలవాల్చుకున్నాడు. అతడి పాదాలు అస్థిరంగా కదిలాయి. అబద్ధం చెప్పాలని అతడికి తెలుసు, కానీ చెప్పలేకపోయాడు. "లేదు, అది చూసి అతడు నవ్వలేదు. నీ పేరు ప్రస్తావించాడు."

"నా పేరు ఇంకా ఎప్పుడెప్పుడు ప్రస్తావించాడు?"

"తిరిగి వచ్చేటప్పుడు పెద్ద కవుకు చెట్ల తోపులో అవి నరికి ఉన్నచోట మరొకసారి ప్రస్తావించాడు."

"అయితే ఏమని నిర్ధారించారు?"

“నిర్ధారణల గురించి నాకు ఎవ్వరూ ఏమీ చెప్పలేదు.”

“చెట్లు కొట్టి ఉన్న చోటుకి ఎవరు తీసుకెళ్లారు? దిక్కూచా?”

“తిరిగి వస్తుండగా వాళ్లంతటవాళ్లే దానిని చూశారు.”

“వాళ్లంతట వాళ్లే చూశారా? వాళ్లకి భలే తెలివైన కాళ్లు ఉన్నట్టున్నాయే.” ఫ్యొడార్ ఇపటొవిచ్ వసారాలో కూర్చుని ఉన్నాడు. అతడి వంటిమీద పాత చొక్కా ఒకటి గుండీలు పెట్టుకోకుండా ఉంది. అతడు గొడ్డళ్లను పదును పెడుతున్నాడు: కర్రలేని పది గొడ్డళ్లదాకా అతడి కాళ్ల దగ్గర ఉన్నాయి. యెగార్ అతడికి ఎదురుగా ఒక కాలు మీద నుంచి మరొక కాలు మీదకి మారుతూ నిలబడి ఉన్నాడు: ఖాళీ సీసా అతడి సంచిలో గలగలలాడుతోంది. అతడు ఫ్యొడార్ ఇపటొవిచ్ కళ్లల్లోకి చూడకుండా ఉండటానికి ప్రయత్నించాడు: చేయి చాచేవాడు ఎప్పుడూ లోకువే.

“వాళ్లంతట వాళ్లు వెళ్లారంటావు. పర్యాటకులు వచ్చిందీ వాళ్లే తెలుసుకున్నారు, చెట్లను నరికిందీ వాళ్లే తెలుసుకున్నారు. తెలివైనవాళ్లనుకుంటా వాళ్లు?”

“తెలివైనవాళ్లు, ఫ్యొడార్ ఇపటొవిచ్,” యెగార్ నిట్టూర్చాడు.

“ఆహాఁహాఁ. మరి నేను చూడు ఏమి చేస్తున్నానో. వస్తువులను బాగు చేస్తున్నాను: జాబితా ప్రకారం వీటిన్నంటినీ సరిచూసుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ ఊరికినే బాగు చేస్తున్నానంటావా, యెగార్?”

“బాగుచెయ్యటం పాడుచెయ్యటం కాదుగా — అది మంచిదే.”

“మంచిదేనంటావు? అయితే నా నిర్ణయం ఏమిటో విను. పాల్మాని మీ మీదకి ఉసికొల్పే లోపల నా దొడ్డిలోంచి బయటకి నడువు! మళ్లీ ఈ జన్మలో నీ ముఖం నాకు చూబించకు. ఎందుకు ఇంకా అలా నిలబడి ఉన్నావు, చేతగాని దద్దమ్మా? ఓవా, పాల్మాని వదిలిపెట్టు! పట్టుకో పాల్మా, పట్టుకో! అతడిని కరువు!”

పాల్మాని వదిలిపెట్టారు, యెగార్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. పాల్మాని వదిలిపెట్టారని కాదు: కుక్కలు అతడిని ఎప్పుడూ ఏమీ చెయ్యవు. ఇక్కడ అతడికి డబ్బులిచ్చేవాళ్లు ఎవరూ లేరని అతడు తనంతట తానే వెళ్లిపోయాడు. దీనికి అతడు చాలా విచారించాడు.

అతడు ఆ ఇంటినుండి బయటకు వచ్చి తన గొడ్డలితో చేసిన కోడిపుంజువైపు చూశాడు. అది తన స్నేహితుడైనట్టు నవ్వాడు, ఆ మరుక్షణం అతడి విచారం మాయమయ్యింది. అతిధులకు

మర్యాద చెయ్యటానికి డబ్బులు దొరకలేదు. ఇంటిపైకప్పు నుండి కోడిపుంజు అరుస్తుండగా, అడవిలో అందమైన అమ్మాయి జుట్టు దువ్వుకుంటూ ఉండగా ఇంత మాత్రానికే విచారపడాలా? లేదు, ఫ్యొడార్ ఇపటొవిచ్, ఇప్పుడు నన్ను బాధపెట్టలేవు, నాలో ఒక ప్రశాంతత నెలకొని ఉంది. ఇటువంటి ప్రశాంతత నీకు ఎప్పుడూ అనుభవంలోకి రాదు. నా దగ్గర డబ్బులు లేకపోవటం, నేను అతిథులకు మర్యాద చెయ్యలేకపోవటం పెద్ద విషయమేమీ కాదు. వాళ్లు నా బొమ్మను అర్థం చేసుకోగలిగితే, దీనిని కూడా అర్థం చేసుకుంటారు.

పరిస్థితిని ఈ రకంగా ఊహించుకున్న తరువాత అతడు తేలికపడిన హృదయంతో, ఖాళీ సంచితో ఇంటివైపుకి బయలుదేరాడు. ఖాళీ సీసా సంచిలో ఎప్పటిమాదిరి గలగలలాడుతూనే ఉంది.

“ఓయ్, పొలుష్కిన్! పొలుష్కిన్!”

అతడు వెనక్కి తిరిగి చూశాడు: యకోవ్ ప్రొకొపిచ్. పడవలు అద్దెకు ఇచ్చే కేంద్రం నుంచి తిరిగి వస్తున్నట్టున్నాడు, అతడి చేతిలో తాళంచెవులు ఉన్నాయి.

“బాగున్నావా,పొలుష్కిన్? ఎక్కడికి పరుగుపెడుతున్నావు?”

యెగార్ అంతా చెప్పాడు.

“ముఖ్యమైన అతిథి,” యకోవ్ ప్రొకొపిచ్ అన్నాడు. “నీ సంచేమో ఖాళీగా ఉంది. ఇదేం బాగాలేదు.”

“టీ ఇస్తాలే.”

“ఇదేం బాగాలేదు,” యకోవ్ ప్రొకొపిచ్ పునరుద్ఘాటించాడు. “ఎంతైనా మనం ఇరుగు, పొరుగు వాళ్లం. నా దగ్గర మూత తియ్యని చందువుల డబ్బా ఉంది. వస్తా, వస్తా దుకాణంలో నుంచి ఏమైనా తీసుకొస్తాను, నీ సంచి ఇటువ్వు. ఒకరికొకరం సాయంపడకపోతే ఎలా? సరేనా?”

“ఏమిటి సరేనా?” యెగార్‌కి ఏమీ అర్థం కాలేదు.

యకోవ్ ప్రొకొపిచ్ చిరాకుగా చూశాడు. అతడు నిట్టూర్చి యెగార్ మందమతితనానికి మందలించాడు కూడా.

“పరిచయం చెయ్యి.”

“ఆహా!” అన్నాడు యెగార్. “నీకు పరిచయం చెయ్యమన్నావా?”

"దుకాణంనుంచి నేను అన్ని సరుకులతో వస్తాను. నన్ను చూసి నువ్వు సంతోషిస్తావు, ఎప్పుడూ న్యాయంగా వర్తించే నీ పాత పైఅధికారిగా నన్ను పరిచయం చేస్తావు."

"అహ్– అలాగే," భారం దిగిపోయిన వాడికిమల్లె ఊపిరి వదిలి అన్నాడు యెగార్. ఆ వ్యవహారం ఆనుపానులన్నీ అర్థంచేసుకుని, "సరే," అన్నాడు.

"నువ్వు మంచివాడివి, పొలుష్కిన్," యెగార్ చేతిలోంచి ఖాళీ సంచి అందుకుంటూ అన్నాడు యకోవ్ ప్రొకొపిచ్. "అటవీ **వా**ర్డెను అంటే చాలా ముఖ్యమైన పక్షి, అది వలస పక్షి కాకపోతే."

ఆ మాటలతో ఇద్దరూ చెరొక దారి పట్టారు. యెగార్ ఇంటికి వెళ్లాడు. ఆ పాటికే బంగాళాదుంపలు ఉడికిపోయి హోరెత్తిస్తున్నాయి. అర్ధగంట తరువాత యకోవ్ ప్రొకొపిచ్ చేతిలో సంచితో వచ్చాడు, ఆపాటికి ఆ సంచి ఖాళీగా గలగలలాడుతూ కాకుండా, నిండుగా గునగునలాడుతూ ఉంది. అతడు తళతళ మెరిసే కొత్త సూటు, చక్కటి గడ్డి టోపీ పెట్టుకుని ఉన్నాడు.

ఇక్కడ విషయమేమిటంటే యకోవ్ ప్రొకొపిచ్‌కి అధికారంలో ఉన్నవాళ్లను కలవటం అంటే ఇష్టం. ఎంత పై అధికారి అయితే అంత ఇష్టం. "నాకు ఒక కార్యదర్శి, ఇద్దరు చైర్మన్లు తెలుసు," అని గొప్పలు కూడా చెప్పుకునేవాడు.

వాళ్లు దేనికి కార్యదర్శులు, చైర్మన్లు అన్నది కూడా అతనికి పట్టదు. అతడికి తన సొంత తారతమ్య బేధాల వ్యవస్థ ఉంది.

కొత్త అటవీ వార్డెనును ఎక్కడ ఉంచాలో అతడు నిర్ణయించేసుకున్నాడు: ప్రభుత్వ వ్యవసాయ క్షేత్ర సంచాలకునికి ఒకింత పైనా, ప్రాంతీయ పార్టీ కమిటీ శిక్షకునికి ఒకింత కిందా. యకోవ్ ప్రొకొపిచ్‌కి యూరి పెట్రోవిచ్ చువలోవ్ వ్యక్తిగత గుణగణాలతో సంబంధం లేదు. అదే సమయంలో అతడినుంచి ఎటువంటి ప్రయోజనం ఆశించటమూ లేదు. అతడిని పరిచయం చేసుకోవాలన్నది పూర్తి అనాసక్తితో కూడినది.

"మేం ఎక్కువ పరిమితులను పాటించం," అతడు చెపుతున్నాడు, "ఈ రోజుల్లో మనుషులకు ఒకదాని మీద లగ్నత కుదరటం లేదు. ఉదాహరణకు నా జీవితాన్నే తీసుకోండి: దాంట్లో ముఖ్యమైనది ఏమిటి? పైనుంచి వచ్చిన ఆదేశాలే దాంట్లో ముఖ్యమైనవి. కానీ నేను

ఒంటరిగా ఉన్నాను, అసంతృప్తితో ఉన్నాను. నన్ను ఈ అసంతృప్తికి లోనుచేస్తున్నదేదో ఉంది, గౌరవనీయమైన మిత్రమా. బహుశా నేను సాధించలేనిది ఏదో ఉంది, లేదా సరిగా అర్థం చేసుకోనిదేదో ఉంది. అదేమిటో నాకు తెలియదు. నేను వార్ధక్యంలోకి ప్రవేశిస్తున్నాని తెలుస్తోంది, నా పట్ల నాకు గౌరవం లేకుండా ముసలివాడిని అవుతున్నాని బాధ. ఏదో అస్పష్టత."

ఈ సంభాషణను కొనసాగించటం యూరి పెట్రోవిచ్‌కి చాలా కష్టం అయ్యింది. యెగార్ అయితే అసలు వినటమే మానేసాడు. నవ్వుతూ ఉండే మంచి మనుషులు ఇంటికి రావటం అతడికి సంతోషంగా ఉంది. పనినుంచి తిరిగివచ్చిన హారిటీనా మరో కారణంతో హడావిడి పడుతోంది.

"అతిథులందరికీ వందనాలు! నోనా, ఇక్కడి ఎండకి భలే రంగు వచ్చావే! యాపిల్ పండులా మెరిసిపోతున్నావు!"

నోనా బుగ్గమీద ముద్దుపెట్టుకుని యూరిని మర్యాదగా సంబోధించింది. ఎక్కడ దాచిపెట్టిందో గాని లోపలినుంచి మిఠాయిలు, బిస్కెట్లు బయటకు తీసింది. తరువాత నోనాని వంటింటిలోకి తీసుకెళ్ళింది. అక్కడ వాళ్లు ఏమి మాట్లాడుకున్నారో యెగార్‌కి తెలియదు కానీ అతడిలో ఏమాత్రం భయం లేదు. అతడు అంతా మంచేనని నమ్ముతాడు, సంతోషంగా ఉంటాడు. బలంగా ఉండి పెద్దపెద్దగా మాట్లాడే అతడి భార్య ఉన్నట్టుండి జాలిగొలిపేలా నిశ్శబ్దంగా రోదిస్తోందని అతడికి తెలియదు.

"నాలో ఇంకా శక్తి లేదు, నోనా. నా మొగుడు నన్ను వేధించి, నిద్ర లేకుండా చేసి నీరసించిపోయేలా చేసాడు. అతడు రోజూ తాగేవాడైనా బాగుండేది, నన్ను కొట్టేవాడైనా, ఇతర ఆడవాళ్లవెంట పడేవాడైనా బాగుండేది. సంవత్సరాలు గడిచిపోతున్నాయి, పిల్లలు పెద్దవాళ్లు అవుతున్నారు, అయినా జీవితంలో స్థిరత్వం లేదు – అది ఇవ్వాళా లేదు, రేపూ ఉండదు. కుటుంబ స్థిరత్వం, కనీస మానవ మర్యాద లేకుండా పిల్లల్ని పెంచటం ఎలా? శరీరానికి తల్లి ఆహారమిస్తే, ఆత్మకి తండ్రి ఇవ్వాలి – ప్రపంచం అలాగే నడుస్తోంది. కానీ కుటుంబంలో పొంతన లేక ఏమీ తెలియని నాబోటి మహిళ ఒంటి చేత్తో అన్నమూ సమకూర్చి, శీలమూ పెంపొందించటానికి అమ్మా, నాన్న పాత్ర ఒక్కదానినే పోషించాలంటే ఎంత కష్టం, నోనా! అబ్బాయిల ఆత్మలను ఆడవాళ్లం నిర్మించలేం. పెద్దపెద్దగా అరుస్తాం కానీ తేలికగా క్షమించివేస్తాం. కన్నీళ్లు తప్పించి

మనదగ్గర ఏమీ ఉండవు. వంట, అంట్లు కడగటం, బట్టలుతకటంతో మనకు రోజు గడిచిపోతుంది, వంటింట్లో మగవాడిని తయారుచెయ్యలేం కదా.”

ఆమె తన బాధను అలా వ్యక్తపరిచింది. కానీ యెగార్‌కి అంతా బాగుంది, అంతా అద్భుతంగా ఉంది. మూడో గ్లాసు పుచ్చుకోగానే అతడు తనమీద పట్టు కోల్పోయాడు.

“అతిధులకు గౌరవ సూచకంగా ఒక పాట పాడరాదా, టీనా?” అని అడిగాడు.

ఆ మాటలనగానే ఎందుకు అడిగానా అని అతడు వగచాడు: ఆమె ఎప్పటిలాగానే తన “అయ్యో-అయ్యో-అయ్యో” పాట ఎత్తుకుంటుందని భయపడ్డాడు. కానీ హారిటీనా ఛాతీ పొంగించి, తల వెనక్కి విరిచి పెద్దగా పాడసాగింది, ఆ స్వరానికి బల్లమీది గ్లాసులు కూడా కంపించసాగాయి:

*అమ్మాయిలూ, అందమైనవాళ్లని ఎందుకు ప్రేమిస్తారూ...*

యూరి పెట్రోవిచ్, భృకుటి ముడివేసి శృతి కలిపి పాడసాగాడు. అతడిననుసరించి కొంచెం ఇబ్బంది పడుతూ నోనా పాడసాగింది. తరువాత యెగార్, కోల్కాలు కూడా గొంతు కలిపారు. హారిటీనా ముందు పాడుతుంటే మిగిలిన వాళ్లు ఆమె పట్ల అనురక్తితో, గౌరవంతో బృందంగా పాడసాగారు.

యకోవ్ ప్రొకొపిచ్ ఒక్కడే వాళ్లతో గొంతు కలపలేదు: అతడు ముటముటలాడుతూ కూర్చున్నాడు. అతను తన సొత్తుని, సమయాన్ని వృధాగా ఖర్చు చేసినందుకు చింతించసాగాడు: పాటల్లో బృందంతో గొంతు కలిపే అధికారి ఎటువంటివాడై ఉంటాడు? అతడు ఎక్కువ కాలం ఇక్కడ కొనసాగడు, అది మాత్రం ఖాయం.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com